అమిత్‌షా మద్దతుతోనే చంద్రబాబు అరెస్ట్ : సిపిఐ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టీడీపీ అధినేత చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసిన విధానాన్ని సిపిఐ జాతీయ నాయకులు కె.నారాయణ ఖండించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మద్దతుతోనే ఈ అరెస్ట్ జరిగిందన్న విషయాన్ని చంద్రబాబు గ్రహించాలని సూచించారు. రివర్స్‌టెండరింగ్ ప్రవేశపెట్టిన జగన్, ఇప్పుడు రివర్స్ రివెంజ్ చేపడుతున్నారని విమర్శించారు. తిరుపతి నగరంలోని గంధంనేని శివయ్య, కష్ణారెడ్డి భవన్‌లో శనివారం సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు ప్రారంభమయ్యాయి. తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని రాష్ట్ర, జాతీయ రాజకీయ పరిణామాలపై ప్రసంగించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులోనూ బస్సు యాత్రకు కొనసాగింపుగా ఉద్యమాలను మరింత ఉధతం చేయాలని పిలుపునిచ్చారు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ కేంద్ర కార్యవర్గసభ్యులు అక్కినేని వనజ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ...

సుగుణమ్మ అరెస్టు

పరసారత్నం దీక్ష

టైర్లు కాల్చి నిరసన మంటలు

టిడిపి నిరసన సెగలు

- అర్ధరాత్రి నుంచే నేతల గృహ నిర్బంధాలు
- కుప్పంలో తిరగబడ్డ తెలుగు తమ్ముళ్లు
- మాజీ మంత్రి పరసారత్నం నిరసన దీక్ష
- రహదారుల దిగ్బంధం, ధర్నాలు
- తిరగని ఆర్టీసీ బస్సులు, మూతబడ్డ షాపులు
- తొట్టంబేడులో ఆగిన టిడిపి కార్యకర్త 'గుండె'

చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారంటూ జిల్లావ్యాప్తంగా ఆందోళనలు హోరెత్తాయి.. ముందస్తు జాగ్రత్తల పేరుతో పోలీసు యంత్రాంగం టిడిపి నేతలను అర్ధరాత్రి నుంచే గృహ నిర్బంధంలోకి తీసుకుంది. చంద్రబాబు అక్రమ అరెస్టు కక్షసాధింపు చర్యల్లో భాగమేనని చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని మండిపడ్డారు. అరెస్టులతో టిడిపి భయపడేది లేదన్నారు. ఓటు అనే ఆయుధంతో 2024లో జగన్మోహన్‌రెడ్డికి బుద్ధి చెబుతామన్నారు. టిడిపి పార్లమెంట్ అభ్యర్థి నరసింహయాదవ్ ఇంటిలోనే జాతీయ జెండాతో నిరసన తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం తంగళ్లపాలెంలో చంద్రబాబును అరెస్టు చేశారన్న వార్తతో టిడిపి కార్యకర్త వెంకటరమణ కుప్పకూలి కోమాలోకి వెళ్లారు. ఎంజిఎం ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం కోలుకున్నారు. మరింత మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు.

టిడిపి ఆధ్వర్యంలో జగన్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - యంత్రాంగం

తిరుచానూరులో.. తిరుచానూరు రఘునాథ రిసార్ట్స్ వద్ద చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. నేర చరిత్ర ఉన్న జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షాలనూ నేరస్తుల్లా భావించి వ్యూహాలు పన్నుతున్నారన్నారు. అరెస్టులతో టిడిపి భయపడేది లేదన్నారు. సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య ఇంటిముందు ధర్నా చేయడంతో ఈస్టు పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. చంద్రబాబు అక్రమ అరెస్టు ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ అని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్ మండిపడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి తిరుపతిలో నరసింహయాదవ్‌ను పోలీసులు చుట్టుముట్టారు. ఆయన నివాసానికి రాకపోకలను స్తంభింపజేశారు. కుటుంబ సభ్యులు సైతం బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా చేశారు. దీంతో స్వగృహంలోనే జాతీయ జెండా చేతబూని నిరసన చేపట్టారు. పంచభూతాలను దోచుకున్న ఏకైక వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అని, అవినీతిపరులను పెంచి పోషిస్తున్నారన్నారు. ఎస్వీయూలో లైబ్రరీ వద్ద విద్యార్థి యువత నాయకులు ఎన్.శేషాద్రినాయుడు, కామినేని రామ్మోహన్ ఆధ్వర్యంలో జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

రామచంద్రాపురంలో.. మండల టిడిపి అధ్యక్షులు ఎం.తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో భారీ ధర్నా నిర్వహించారు. ఉమాపతినాయుడు, కె.నరసింహారెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు. **యర్రావారిపాలెంలో..**మండల అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ ఆధ్వర్యంలో సైకో జగన్ అంటూ రోడ్డుపై బైఠాయించి శాంతియుతంగా నిరసన తెలిపారు. **పాకాలలో..** ఆధారాలు లేకుండా అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమని టిడిపి మండల అధ్యక్షులు బోయపాటి నాగరాజు నాయుడు మండిపడ్డారు. ఉద్రిక్త వాతావరణం మధ్య నిరసన ధర్నాలు జరిగాయి. **పుత్తూరు టౌన్‌లో...** టిడిపి మండల అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు ఇంటి వద్ద, రూరల్ మండల అధ్యక్షులు రవికుమార్‌ను తొర్రూరు గ్రామంలో, బాలాజీనీ పరమేశ్వర మంగళం వేపగుంట క్రాస్ వద్ద, టిఎన్‌టియుసి మాధవనాయుడును ఇంటి వద్ద గృహ నిర్బంధం చేశారు. బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగరెడ్డి ఇంటి వద్దనే ధర్నా నిర్వహించారు. 16 నెలలు జైల్లో ఉండి, 32 కేసుల్లో ప్రథమ ముద్దాయిగా ఉన్న వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే ఇలానే జరుగుతుందన్నారు. **చిన్నగొట్టిగల్లులో...** ఆర్వీ రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, నాగిరెడ్డి, చట్టేవారిపాళెం బాబురెడ్డి, క్రిష్ణారెడ్డి, బాలాజీ, క్రిష్ణయ్య, వెంకీ తదితరులు నిరసనలు పాల్గొన్నారు. **బాలాయపల్లిలో...** వెంకటగిరి – గూడూరు రోడ్డు మార్గంలో రాయిమస్తాన్ నాయుడు, సత్యం నాయుడు, కూను శ్రీహరి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కుట్ర రాజకీయాలు ఎన్నడూ చూడలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయ్యి చంద్రబాబును పీడిస్తున్నారని పార్టీ సీనియర్ నాయకుడు కూరపాటి రామచంద్రనాయుడు ఆరోపించారు. రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు అరెస్టు చేశారు. **రేణిగుంటలో ...** రమణ విలాస్ కూడలిలో జాతీయ రహదారిపై నాయకులు ధర్నా చేస్తుండగాపోలీసులు అరెస్టు చేశారు. టిడిపి మండల అధ్యక్షులు మునిచంద్రరెడ్డి, లీగల్ సెల్ నాయకులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, చెంచయ్య యాదవ్, నీలకంఠారెడ్డి, భాస్కర్‌యాదవ్, నాదమునిరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. టిడిపి పట్టణాధ్యక్షులు మహబూబ్‌బాషాను గృహ నిర్బంధం చేశారు.

వరదయ్యపాళెంలో... టిడిపి నాయకులు యుగంధర్‌రెడ్డి, నిర్మల్, నవాబ్‌లు ధర్నా చేయాలని ప్రయత్నించడంతో ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. స్టేషన్‌కు తరలించారు. **పెళ్లకూరులో...** సొంత గృహాలు దాటకుండా నాయకులను నిర్బంధించారు. వేలూరు మురళీకృష్ణారెడ్డి, పేరం రమేష్‌నాయుడు, సంచి కృష్ణయ్య, గోపాలరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులను గృహ నిర్బంధం చేశారు.

కోటలో.. షేక్ జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ వద్ద నిరసన తెలిపారు. కోట ఎంపిటిసిలు దారా సురేష్, షేక్ షంషుద్దీన్ తదితర నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు మధ్యాహ్నం మూడు గంటలకు విడుదల చేశారు. **వెంకటగిరిలో...** నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎస్ఐ నరసింహారావు, బాలాయపల్లి ఎస్ఐలు టిడిపి నాయకులు గంగోడు నాగేశ్వరరావు, పప్పు చంద్రమౌళిరెడ్డిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. **నాయుడుపేటలో..** పట్టణ సీనియర్ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, కామిరెడ్డి అశోక్‌రెడ్డిలను గృహ నిర్బంధం చేశారు. ఇళ్లల్లోనే నిర్బంధం దుర్మార్గమని, వైసిపి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు.

రామచంద్రాపురంలో నల్లబ్యాడ్జీలతో...

బాబు అరెస్టు వార్త విని కార్యకర్త మృతి

ప్రజాశక్తి–శ్రీకాళహస్తి

టీడీప అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు వార్త విని గుండె పోటుతో ఆ పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్త మతి చెందిన ఘటన శనివారం తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం తంగేళ్ల పాలెం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు... తంగేళ్లపాలెం చెందిన వెంకటరమణ(43) టిడిపిలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్నారు. తమ ఊరి భూత్ ఇంచార్జిగానూ ఉన్నారు. ఆయన సతీమణి హైమావతి 2014–19 వరకు తంగేళ్లపాలెం ఎంపీటీసీగా పనిచేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి నంద్యాలలో చంద్రబాబు అరెస్టు వార్త విని తట్టుకోలేక వెంకటరమణ గుండెపోటుకు గురయ్యాడు. ఆయన్ను శనివారం తెల్లవారుజామున పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో తిరుపతి స్విమ్స్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటరమణ మతి చెందారు. నిబద్ధత కలిగిన కార్యకర్తను పోగొట్టుకోవడం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గాలి మురళి నాయుడు విచారం వ్యక్తం చేశారు. వెంకటరమణ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఫైల్‌ఫొటో

అట్టుడికిన కుప్పం

శనివారం తెల్లవారుజామున పోలీసులు నారా చంద్రబాబునాయుడిని అరెస్టు చేశారని తెలియడంతో తెలుగు తమ్ముళ్లు ఒక్కసారిగా తిరగబడ్డారు. బాబు అరెస్టు అక్రమం అంటూ నిరసనలు తెలిపారు. పోలీసులు ముందస్తు జాగ్రత్తల పేరుతో నాయకులను గృహ నిర్బంధం చేయడం వారికి మరింత ఆగ్రహాన్ని కలిగించింది. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు కుప్పం పోలీసు స్టేషన్ ముందు బైఠాయించి నిరసన ధర్నా చేపట్టారు. కుప్పం బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి సహకరించారు. క్రిష్ణగిరి– పలమనేరు జాతీయ రహదారిపై టైర్లను కాల్చడం, పెద్దపెద్ద చెట్లను నరికి రోడ్లకు అడ్డంగా వేయడం వల్ల వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. పోలీసులు అరెస్టుకు పూనుకోవడంతో మాటా మాటాపెరిగి స్టేషన్ గేట్లను తీసుకుంటూ రోడ్డుపైకి వచ్చారు. దీంతో కొంతసేపు తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు చేతులెత్తేయడంతో టిడిపి శ్రేణులు తిరిగి మరోసారి రోడ్డుపై పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు.

టిడిపి ఆఫీసు వద్ద పరసా నిరసన దీక్ష

సూళ్లూరుపేటలో.. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి కార్యాలయానికి భారీగా నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. అయితే వారిని వెళ్లనీకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో మాజీ మంత్రి పరసారత్నం కార్యాలయం వద్దే నిరసన దీక్ష చేపట్టారు. సొమ్మసిల్లి పడిపోవడంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా పోలీసులకు, టిడిపి కార్యకర్తలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. చంద్రబాబును విడుదల చేసేంత వరకూ దీక్ష చేస్తానని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో టిడిపి నేతలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కొక్కు శంకరయ్య, చిట్టేటి పెరుమాళ్ పాల్గొన్నారు.

వైసిపికి కౌంట్‌డౌన్ మొదలు : జనసేన

తిరుపతి (మంగళం) : పరిపాలన చేతకాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ఈ రాష్ట్రంలో ప్రతిపక్షాల నోరు నొక్కి జగన్ రాజకీయం చేస్తున్నారని, వైసీపీకి కౌంట్‌డౌన్ మొదలైందని జనసేన నాయకులు కిరణ్‌రాయల్ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండించారు. జగన్ అండ్ టీం త్వరలోనే జైలుకుపోయే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈనెల 11న అవినీష్‌రెడ్డి బెయిల్ రద్దు కాబోతున్న తరుణంలో డైవర్షన్ రాజకీయాలకు తెరదీశారన్నారు. విలేకరుల సమావేశంలో రాజారెడ్డి,రాజమోహన్,రాజేష్ ఆచారి పాల్గొన్నారు.

పోలీసుల నాకాబంది

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

జిల్లావ్యాప్తంగా పోలీసులు శనివారం నాకాబంది నిర్వహించారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు సిబ్బందితో ప్రధాన కూడలిలో ఎలాంటి ఘటనలకు తావు లేకుండా గట్టి చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, అసాంఘిక ఘటనలకు ఆస్కారం లేకుండా నిరోధించడానికి మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన కొరకు నాకాబంది నిర్వహించారు. జిల్లా ఎస్పీ పీ. పరమేశ్వర రెడ్డి స్వయంగా నాకాబందిలో పాల్గొని శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ యస్.పి కులశేఖర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వైసిపి రాజకీయ కేంద్రాలుగా యూనివర్సిటీలు

రాష్ట్ర సదస్సులో ఎంఎల్‌సి లక్ష్మణరావు

ప్రజాశక్తి - క్యాంపస్ (ఎస్వీయూ)

జాతీయ నూతన విద్యా విధానంతో యూనివర్సిటీలలో ప్రమాణాలు దెబ్బతింటున్నాయని, ఉన్నత విద్యకు ప్రమాదం ఏర్పడిందని వక్తలు ఉద్ఘాటించారు. రాష్ట్రంలో యూనివర్సిటీలను వైసిపి రాజకీయ కేంద్రాలుగా మార్చడం సిగ్గుచేటన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర విశ్వ విద్యాలయాల విద్యార్థుల కన్వెన్షన్ శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉన్నత విద్య నేడు ప్రమాదంలో ఉందని, ప్రాథమిక విద్యలోచేరిన వారు ఉన్నత విద్యకు వచ్చేసరికి వారి సంఖ్య గణనీయంగా పడిపోతుందన్నారు. కేంద్రం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం యూనివర్సిటీల స్వతంత్రతను దెబ్బతీసేలా ఉందన్నారు. యుజీసీని రద్దు చేస్తూ వర్సిటీల అభివృద్ధికి నిధుల కోత విధిస్తూ, స్వయం ప్రతిపత్తిని కోల్పోయేలా విశ్వ విద్యాలయాలను మార్చే కుట్ర జరుగుతోందన్నారు. రాష్ట్రంలో యూనివర్సిటీలకు నిధులు కేటాయించకుండా వాటి అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. రాష్ట్రంలో 16 యూనివర్సిటీలకు గాను 3,450 పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించి, హేతుబద్ధీకరణ పేరుతో 845 పోస్టులు కుదించి, చివరకు 2,635 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్నారన్నారు. వెంటనే పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. మరోవైపు విశ్వ విద్యాలయాలు అధికార పార్టీ అనుకూల రాజకీయ కార్యకలాపాలకు నిలయంగా వీసీలు ప్రవర్తిస్తున్నారన్నారు. యూనివర్సిటీలు మేధావుల కేంద్రంగా భావసంఘర్షణ జరిగేలా పూనుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ యూనివర్సిటీల అభివృద్ధికి ఎనలేని పోరాటాలునిర్వహించిన చరిత్ర ఎస్ఎఫ్ఐకి ఉందన్నారు. ఈ వారసత్వాన్ని కొనసాగించాలన్నారు. వర్సిటీలో ప్రజాస్వామ్య హక్కులు హరిస్తున్న నేపథ్యంలో ప్రశ్నించే గొంతులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్వీ యూనివర్సిటీ వీసీ వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ్, సహాయ కార్యదర్శి కిరణ్, నాయక్, రవి, అన్షిడ్, హరిత, ఆనంది, రాష్ట్రంలోని యునివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఎస్ఎఫ్ఐ విద్యార్థుల ర్యాలీ

పాలకులు విదేశాల్లో... ప్రజలు రోడ్డుపైకి..

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

పాలకులు విదేశాల్లో పర్యటిస్తుంటే, ప్రజలు రోడ్డుపైకి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తున్నారు. భారతదేశాన్ని ఆకలి చావులు లేని దేశంగా తయారు చేయాల్సిన బాధ్యత దేశ ప్రధానమంత్రిది. దురదృష్టవ శాత్తు ఆ స్థానంలో ఉన్న వ్యక్తి మనువాదాన్ని అమలు చేస్తూ రాజ్యాంగాన్ని విస్మరించి, మతాలు, కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ.. విదేశాలు చుడుతూ, విహరయాత్రలు చేస్తూ దేశ సార్వభౌమత్వానికి మచ్చ తెచ్చేలా వ్యవహరించడం దారుణం. విదేశీ పర్యటనలు.. విద్వేషాలు పెంచడమే పనిగా పెట్టుకున్నట్లు ప్రదాని నరేంద్రమోడి వ్యవహరించడం దారుణమంటూ కమ్యూనిస్టులు ఎక్కడకక్కడ నిలదీస్తూనే ఉన్నారు. అయినా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని అమలు చేసేందుకే కేంద్రం ప్రాధాన్యత ఇవ్వడం గమనార్హం.

ప్రదాని నరేంద్రమోడి తాము అధికారంలోకి వస్తే అవిచేస్తాం, ఇవి చేస్తామంటూ 2014 ఎన్నికల ముందు అనేక హామీలను గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నారని ప్రతి పక్షాలు కోడై కూస్తున్నాయి. విదేశాల్లో దాగిన నల్లధనం తీసుకురాలేదు. అవినీతిని నిర్మూలించలేదు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీకి అనుకూలంగా కోట్లాది ఉద్యోగాల కల్పన ఊసేలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా తనకు దత్తపుత్రులుగా ప్రచారం అవుతున్న ఆధాని, అంబానీలకు లక్షలాది కోట్ల రూపాయల దేశ సంపదను దోచి పెడుతూ, మోడి తీరును ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం పనిగా పెట్టుకున్నారు. పైగా పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టి బిల్లు తదితర వాటితో రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలపై పెత్తనం చెలాయించేందుకు కుట్ర చేశారు. ప్రతిపక్షాలపై గవర్నర్లు, సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ వంటి వాటిని ఉసిగొల్పి భయభ్రాంతులకు గురి చేయడం, తమ తీరును ప్రశ్నించిన రాష్ట్రాల్లో విద్వేషాలు రెచ్చగొట్టడం, మతాన్ని అడ్డం పెట్టుకుని దాడులకు పురిగొల్పడంతో ఈశాన్య రాష్ట్రాల్లు ఇప్పటికే అగ్నిగుండాలుగా రగులుతున్న విషయం అందరికి ఎరుకే. ఆఖరికి జి20 సదస్సు పేరుతో ప్రచార ఆర్భాటాలు, జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలన్ని ఏకమై ఇండియా కూటమి కట్టడంతో బెంబేలెత్తి ఏకంగా దేశానికి ఇండియా పేరును తుడిచి పెట్టేందుకు పూనుకోవడం బాధాకరం. ఇంత జరుగుతున్నా ప్రశ్నించకపోగా ఆంధ్రప్రదేశ్‌లోని బూర్జువ రాజకీయ పార్టీలు మోడికి మోకరిల్లడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం. పోనీ రాష్ట్రానికి మోడి ఏమన్నా చేశాడంటే ఏమీ లేదు. రాష్ట్రానికి తలమానికమైన పోలవరాన్ని పట్టించుకున్న పాపనపోలేదు. విభజన తర్వాత కష్టనష్టాలతో అల్లాడుతున్న ఆంధ్రప్రదేశ్‌కు కనీసం రాష్ట్రరాజధాని నిర్మాణం కూడా చేపట్టలేదు. ప్రత్యేక హోదా అయిపోయిన అంకంగా మార్చేశారు. ప్రత్యేక నిధులు కథ సరే రాష్ట్రానికి సాధారణంగా రావాల్సిన నిధులు కూడా ఇవ్వడం లేదు. పన్నుల పైసలను పక్కన పెట్టుకుని, కేసుల బూచి చూపుతూ అధికార, ప్రతిపక్షాలను బెదిరించే దోరణికి దిగారు. అయినా ఆయనకు తమ మద్దతు అంటూ రాష్ట్రంలోని బూర్జువా రాజకీయ పార్టీలు పోటీలు పడడం శోచనీయం. దేశంలోనూ,..రాష్ట్రంలోనూ జరుగుతున్న ప్రజావ్యతిరేక పాలనను ఖండిస్తూ ..ప్రజలను చైతన్య వంతం చేసేందుకు కమ్యూనిస్టుపార్టీలు నడుంబిగించాయి. ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యంలో అనేక సదస్సులు, జాతాలు, యాత్రలు ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు చేపట్టారు. తాజాగా సమరశంఖం పూరించారు. సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని రక్షించండి...దేశాన్ని కాపాడండి అంటూ రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాత నిర్వహించారు. ఈ నెల 8న తిరుపతి కేంద్రంగా ముగిసిన బస్సు జాతా సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభ వేదికగా మోడి తీరును ఎండగడుతూ....ప్రజల్లో చైతన్యాన్ని నింపారు. దేశ సమగ్రత కోసం కమ్యూనిస్టులు చేసే పోరాటాలకు అనేక ప్రాంతీయ, జాతీయ పార్టీలు మద్దతు ప్రకటిస్తూ, మతచాందస్తవాదీ మోడిని గద్దె దింపేందుకు జనం నడుం బిగిస్తారో లేదో మరి.

12న టెక్నాలజీ మిషన్స్‌పై జాతీయ స్థాయి సదస్సు

పజాశక్తి - తిరుపతి(మంగళం)

శాస్త్ర సాంకేతిక రంగంలో భారత్ పురోగమిస్తోంది. ప్రపంచ దేశాలు నివ్వెరపోయేలా మన దేశంలో పరిశోధనలు అభివద్ధి చెందుతున్నాయి. విద్య, వైద్యం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లోనే కాకుండా ఉత్పాదక రంగంలోనూ భారత్ తన సత్తాను చాటుతోంది. అంతర్జాతీయ విపణిలో భారత్ కు నేడు ఎంతో ప్రాధాన్యత, గుర్తింపు లభిస్తోంది. ఇందుకు ప్రధాన కారణం శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదగడమే. ఇటీవల జరిగిన చంద్రయాన్–3 ప్రయోగమే ఇందుకు ప్రబల నిదర్శనం.

తిరుపతి నగరంలో పలు యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు, విద్యాలయాలు ఉన్నాయి. ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలు, పరిశోధనా రంగ విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై సమగ్రమైన సూచనలు అవసరం. తిరుపతి కేంద్రంగా జులై 1, 2022న ఏర్పాటైన ఇన్నోవేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్) ఇందుకోసం నడుం బిగించింది. దేశ ప్రయోజనాలే లక్ష్యంగా ప్రపంచ దేశాలకు ధీటుగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివద్ధి పరచాలన్నదే ధ్యేయంగా ఈ ఫౌండేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 12న తిరుపతి ఐఐటీలో జాతీయ స్థాయిలో నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్స్పై ప్రత్యేక సదస్సును నిర్వహిస్తోంది. తిరుపతి ఐఐటీ ఇందుకు సరైన వేదికను సమకూర్చుతుండగా, విజ్ఞానభారతి కూడా తన వంతు సహకారాన్ని అందిస్తోంది. మంగళవారం తిరుపతిలో జాతీయస్థాయి సదస్సును నిర్వహించనున్నారు.

హాజరయ్యే ప్రముఖులు వీరే

మంగళవారం తిరుపతి ఐఐటీలో జరిగే సదస్సుకు శాస్త్ర సాంకేతిక రంగంలో, నిష్ణాతులైన పలువురు ప్రముఖులు హాజరవుతున్నారని తిరుపతి ఐఎస్ఎఫ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి నారాయణరావు , ఐఐటీ డైరెక్టర్ సత్య నారాయణ, విజ్ఞాన భారతి ప్రతినిధి కొంపెళ్ళ శాస్త్రి పేర్కొన్నారు. నీతి అయోగ్ మెంబర్ డాక్టర్ వీకే సారస్వత్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సెక్రెటరీ డాక్టర్ ఎం రవిచంద్రన్, సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కలైసెల్వి. డీఆర్డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ లీకే డాస్, శాంతాబయోటెక్ వరప్రసాదరెడ్డిలు పాల్గొంటున్నట్లుతెలిపారు.

అన్ని ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అన్ని ఆధారాలతోనే చంద్రబాబును సిఐడి అరెస్టు చేసి, రోడ్డు మార్గంలో విజయవాడకు తరలించారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తిరుపతిలో విలేకరులతో మంత్రి మాట్లాడుతూ సిఐడి అడిషనల్ డిజి సంజెయ్ కేసుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించారన్నారు. 90శాతం సీమెన్స్, 10 శాతం ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉండగా, 3,356 కోట్ల ప్రాజెక్టులో 371 కోట్లు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉండగా, ప్రభుత్వం తరపున 3వేల కోట్లు ఎందుకు ఖర్చు చేశారన్నారు. సీమెన్స్, డిజిటెక్, స్కిల్లర్ కంపెనీల ప్రతినిధులను ఇప్పటికే ఈ కేసులో అరెస్ట్ చేశారన్నారు. చంద్రబాబునాయుడు స్వయంగా చేసిన స్కాం అని వివరించారు.

చంద్రబాబు జీవితమంతా కుట్రలే

చంద్రబాబు రాజకీయ జీవితం అంతా కుట్రలతోనే సాగిందని, అతనికి వెన్నుపోటు, పన్నుపోటు మాత్రమే తెలుసని, ఈరోజు చట్టం యొక్క పోటు తెలిసిందని తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చట్టానికి తెలియకుండా లోల కోట్లు దోచేశారన్నారు. హత్యలు, అవినీతితోనే కాపురం చేశారన్నారు. ఇసుక నుంచి తైలం తీయొచ్చుని, ఆయన అరెస్టు ద్వారా సానుభూతి రాదన్నారు.

రూ.371 కోట్లు నొక్కేసిన చంద్రబాబు : నేదురుమల్లి

వెంకటగిరి రూరల్ : సీమన్ కంపెనీ పేరుతో రూ.371 కోట్లును చంద్రబాబు నొక్కేశారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని రూ.371 కోట్ల ప్రజాధనాన్ని షెల్ కంపెనీలకు తరలించి లూటీ చేశాడని ఆరోపించారు.

దళితులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గుంటకిందపల్లి భూ వివాదం కేసులో దళితులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తి వేయాలంటూ కార్మిక, దళిత, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో కార్మిక, దళిత, ప్రజా సంఘాల నాయకులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటకిందపల్లిలో దళితులకు చెందిన భూమి ఆక్రమణపై అధికార పార్టీ నేతలకు వ్యతిరేకంగా పోరాడినందుకు జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ తో పాటు మరో ముగ్గురు దళితులపై హత్యాయత్నం కేసులు నమోదు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. వెంటనే వారిపై అక్రమ కేసులు ఎత్తి వేసి, దళితుల భూములు వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చందమామల కోటయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య పాల్గొన్నారు.

దళితులపైకేసులు ఎత్తివేయాలని నినదిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వెంకటపతి నగర్ నిషేధిత జాబితా భూములకు పరిష్కారం: కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నిరుపేద మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చాలని దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత భూముల (22 శాతం) పరిష్కారం చూపిందని కలెక్టర్ కె వెంకటరమణ రెడ్డి అన్నారు. శనివారం చంద్రగిరి మండలంలోని వెర్రేపల్లి లో వెంకటపతి నగర్ లో ని నిషేధిత భూములకు (22 శాతం) శాశ్వత పరిష్కారానికి సంబంధించిన కార్యక్రమానికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తో కలిసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేద మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత భూములకు (22శాతం) పరిష్కారం చూపిందన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డి చొరవ అభినందనీయం అని అన్నారు. 22 శాతం భూములకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపడంతో విముక్తి లభించిందని అన్నారు. భూములు సాగు చేసుకుంటున్న పట్టా ఉన్న అవసరానికి క్రయవిక్రయాలకు అవకాశం ఉండేది కాదని తెలిపారు. ఈ సమస్య పరిష్కార దిశగా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మంచి చేకూర్చాలనే దిశగా అడుగులు వేసి భూములకు విముక్తి కలిగించిందన్నారు. వెంకటపతి నగర్ కు సంబంధించి నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములకు శాశ్వత పరిష్కారం దిశగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రొసీడింగ్స్ ఇచ్చినట్లు తెలిపారు. ఇందుకు జాయింట్ కలెక్టర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ గ్రామానికి సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తా మన్నారు. జెసి మాట్లాడుతూ వెంకటపతి నగర్ కి సంబంధించి దిన భూ సమస్యను కలెక్టర్ పాజిటివ్ గా తీసుకొని పరిష్కారానికి ఎంతో కృషి చేశారని, 36 సంవత్సరాలుగా పున్నసమస్య వెంకటపతి నగర్ లోని భూములను రీ సర్వే చేయించి నిషేధిత జాబితా నుండి వారి భూములకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. గ్రామ సర్పంచి చిన్ని యాదవ్ ఎంతో కృషి చేశారని తెలిపారు. తుడా చైర్మన్ మాట్లాడుతూ 36 సంవత్స రాలుగా తీరని వారి సమస్యను నిషేధిత జాబితా లోని భూములకు శాశ్వత పరిష్కారం చూపించామన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఈ గ్రామ భూమి ప్రభుత్వ భూమిగా ఉండటంవల్ల నిషేధిత భూముల జాబితాలో పెట్టారని, అందువల్ల ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ జరగలేదని తెలిపారు. ఇప్పుడు ఈ గ్రామ ప్రజలకు వారి భూములపై శాశ్వత హక్కు కల్పించి క్రయ విక్రయాలు మార్గం చూపించామన్నారు. ఈ గ్రామ సమస్య పరిష్కారానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం చేసి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పించి శాశ్వత హక్కు కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం వెంకటపతి నగర్ భూములకు సంబంధించిన నిషేధిత జాబితా నుంచి తొలగించిన ప్రొసీడింగ్స్ ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తుడా చైర్మన్ తో కలిసి జిల్లా రిజిస్ట్రార్ అధికారి అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ కనక నర్సారెడ్డి, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, గ్రామ సర్పంచి చిన్ని యాదవ్ జిల్లా రిజిస్ట్రార్ అధికారి శ్రీరామ్, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో నగదు బహుమతులను గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో కళాశాల విద్యార్థినులు విశేష ప్రతిభను కనబరిచి బహుమతులను సొంతం చేసుకున్నారు. విజేతలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె మహదేవమ్మ, కళాశాల కోకరిక్యులర్ కోఆర్డినేటర్, తెలుగు విభాగాధిపతి డాక్టర్. వి. కృష్ణవేణి అభినందించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో విద్యార్థినులు బహుమతులు స్వీకరించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్ననిర్వాహకులు

జాతీయ లోక్ అదాలతో 987 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ లో 987 కేసులు పరిష్కరించి రూ.2,27, 86,435 మేర రాజీ చేసినట్లు పుత్తూరు మండల న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. సివిల్ కేసులు 44 కేసులు రూ 1.1986 మేర ఆస్తులు పరిష్కరించామని, 931 క్రిమినల్ కేసులు, రూ.870227 మేర ప్రీవిటి గేషన్ కేసులు12 పరిష్కరించామని జడ్జి తెలిపారు. రూ. 20,91,275 మేర ఆస్తి వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్ లో న్యాయమూర్తులు రాఘవేంద్ర, సి జానకి, గోపాలకృష్ణ వ్యవహరించారు. పుత్తూరు న్యాయవాదులు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇంకా పెండింగ్ లో వున్న కేసుల పరిష్కారానికి సమయం వృథా చేసుకోకుండా ఆదా చేసుకో వచ్చన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలతో వివిధ రకాల విన్యాసాలు చేశారు. మాదక ద్రవ్యా లు ఉపయోగిస్తే చట్టారీత్యా నేరమని, వివిధ రకాల శాఖల ద్వారా వైద్య శిబిరాలు, పౌష్టికాహారాలకు సంబంధించిన స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సంజీవి, కేజీ ప్రభాకర్, మండల విద్యాశాఖ అధికారి తిరుమల్ రాజు, బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, కక్షిదారులు, బ్యాంకు అధికారులు, పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కోట: కోట మండలంలోని గూడలి పంచాయతీ పరిధిలో ప్రకాశం కాలనీకి చెందిన కటికాల నారాయణ అనారోగ్యంతో ఉండ డంతో మందులు ఖర్చు నిమిత్తం శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం రమణయ్య చేతుల మీదుగా శనివారం 2వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా అల్లం రమణయ్య మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న కటికాల నారాయణకు ప్రతి నెల వెయ్యి రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సాయంను నెల్లూరుకి చెందిన ఓరుగంటి సూర్య ప్రకాష్ రావు, శేషమ్మ కుమారులు ఓరుగంటి వసేంద్ర కుమార్ దాతృత్వంతో అందిస్తున్నామన్నారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఆగస్టులో ఇవ్వాల్సిన వెయ్యి రూపాయలు ఇవ్వలేక పోవడంతో శనివారం ఈ నెలలో ఇవ్వాల్సిన నగదు తో పాటు రెండు వేల రూపాయలను అందించామన్నారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అపుల సుబ్బయ్య పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం ఉత్తరపు కండ్రిగ దళితవాడకు చెందిన పలువురు టిడిపి యువ నాయకులు దయాకరాల ప్రకాష్ , సమక్షంలో వైసిపి నుండి టిడిపిలో చేరారు. నగరి నియోజక వర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా టిడిపి కండువాలు కప్పి ఆ పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన యువకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి తామంతా కలిసికట్టుగా చేస్తామన్నారు. వారికి అభినందనలు తెలిపారు. ఆ పార్టీలో చేరిన వారిలో అనిల్ కుమార్, ప్రేమ్ కుమార్, మణి, సురేష్, వాసు, కరుణ, కిషోర్ వున్నారు.

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి-తడ: మండల విద్యా శాఖాధికారి –2 మల్లిఖార్జున రావు మండ లం లోని ప్రాథమిక పాఠశాల లు వెండ్లురుపాడు, యన్. యమ్ కండ్రిగ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధ్భంగా పిల్లల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం ను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు అందించారు. వీరితో పాటు సిఆర్‌పి మునస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులు విద్య విలువను తెలుసుకోవాలి

- ఆచార్య శ్యామ్‌మోహన్ డేవిడ్ రాజు

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు విద్య విలువ తెలుసుకొని తరగతి గదిలో పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత లక్ష్యాల దిశగా రాణించాలని వయోజన విద్యా విభాగం ఆచార్యులు బి. శ్యావమ్‌మోహన్ డేవిడ్ రాజు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వయోజన విద్యా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం తిరుపతి రూరల్ మండల పరిధిలోని మల్లంగుంట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, దేశంలోనూ విద్య ప్రాముఖ్యతను, అవసరాన్ని వివరించారు. విద్యార్థులు అక్షరాస్యులుగా ఉన్నత రంగాల్లో రాణించడం ద్వారా దేశ, రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తారన్నారు. వయోజన విద్యా విభాగాధిపతి ఆచార్య ఆర్ బి సత్యవతి మాట్లాడుతూ నేటి బాలలే రేటి పౌరులని, చదువుకున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులకు నిరక్షరాస్యులైన వారికి చదవడం, రాయడం, లెక్కలు చేయడం నేర్పించాలని సూచించారు. ప్రధానోపాధ్యా యురాలు భువనేశ్వరి దేవి మాట్లాడుతూ విద్య లేని వారు వింత పశువు అనే నానుడి నుంచి భారతదేశంలో అక్షరాస్యతలో 75 శాతంపైనే అభివృద్ధి సాధించారన్నారు. దేశంలో అక్షరాస్యతలో కేరళ మొదటి స్థానం వున్నట్లే మన రాష్ట్రం ప్రథమ స్థానంలోకి రావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు వ్యాసరచన, మౌఖిక పరీక్షలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం సి ఓబులేసు, ఎం సుబ్రహ్మణ్యం, ఈ మహదేవరెడ్డి, పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితం.. అధ్యయనం పోరాటంగా సాగాలి

- ఎస్వీయూ ప్రొఫెసర్ పిసి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థి తన జీవిత కాలంలో కేవలం విద్యాభ్యాసంతోనే సరిపెట్టుకోకుండా సమాజ అధ్యయనం, పోరాటాలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ పిసి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం బైరాగి పట్టెడలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో పిడిఎస్‌యు రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక తరగతులు ప్రారంభమయ్యాయి. ముందు రాష్ట్ర అధ్యక్షుడు ఈ భూషణం పిడిఎస్‌యు పతాకాన్ని ఆవిష్కరించి విప్లవ వీరులకు గౌరవ వందనం చేశారు. అనంతరం అమరులైన పిడిఎస్‌యు విద్యార్థి నాయకులకు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పి సి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పైన, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పైన విద్యార్థి సంఘాలు చేస్తున్న పోరాటాలతో అనేక సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. నేడు పాలకులు కొన్ని పథకాలతో విద్యార్థుల ఖాతాల్లోకి డబ్బులు వేస్తున్నారని దీనివల్ల వారికి ఒరుగుతున్న ప్రయోజనం ఏమీ లేదన్నారు. పథకాల పేరుతో స్కాలర్‌షిప్‌లు ఎత్తివేయడం వల్ల విద్యార్థులు అన్యాయానికి గురయ్యారన్నారు. ప్రస్తుత సమాజంలో మార్పు కోసం పరితపిస్తున్న విద్యార్థి సంఘాలను నిర్వీర్యం చేసేలా జరుగుతున్న తప్పుడు ప్రచారాలను విద్యార్థులు అర్థం చేసుకోవాలన్నారు. దేశంలో విద్యారంగ ప్రైవేటీకరణకు జరుగుతున్న కుట్రలను, పాలకులు చెబుతున్న మాయ మాటలను క్షుణ్ణంగా పరిశీలించి నిలదీయాలన్నారు. సనాతన ధర్మం పేరుతో సమాజంలో కొన్ని వర్గాలను అణచివేస్తున్న ధోరణిని ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్నారని ఆయన వివరించారు. ప్రతి విద్యార్థి సమాజాన్ని నిశితంగా అధ్యయనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె భాస్కర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి హృదయ రాజు, తెలంగాణ రాష్ట్ర పిడిఎస్‌యు ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

గాజులమండ్యం అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి హామీ

ప్రజాశక్తి -రేణిగుంట : గాజులమండ్యం అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం కార్యాచరణ రూపొందించామని వైసిపి మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్ర రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం ఆ ప్రాంతాన్ని తిరుపతి ఎంపీ గురుమూర్తి వైసీపీ మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్ర రెడ్డి పరిశీలించారు. గాజులమండ్యంలో విద్యార్థులు గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందంటూ విద్యార్థులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి తెలిపారు. తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలిసి రేణిగుంట మండల ఇన్‌చార్జి పవిత్ర రెడ్డి గాజులమండ్యం అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం పనులు నిర్వహించేందుకు వీలుగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బియ్యపు పవిత్ర రెడ్డి మాట్లాడుతూ రేణిగుంట మండలంలోని గాజులమండ్యం గ్రామం నందు విద్యార్థులు తమ పాఠశాలలు వెళ్లడానికి గ్రామస్తులు అత్యవసర సమయంలో గ్రామం నుంచి వెళ్లడానికి అండర్ పాస్ బ్రిడ్జి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని త్వరలోనే అధికారులతో సంప్రదించి అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ఎంపీ గురుమూర్తి, పవిత్ర రెడ్డి విద్యార్థులకు హామీ ఇచ్చారు. గాజులమండ్యం గ్రామస్తులు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల ఎంపిపి కలపాటి హరిప్రసాద్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు పన్నీరుకాల్వ శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ గంగారీ రమేష్, ఎంపీటీసీలు ధనంజయ రెడ్డి, వెంకట రమణ రెడ్డి,ఆనంద్ రావ్, దయాకర్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, మోహన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, భాస్కర్ యాదవ్, నారయ్య యాదవ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణం లో జరుగుతున్న అభివృద్ధి పనులను గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 75సంవత్సరాల నుండి జరగని అభివృద్ధి, నాలుగు న్నర సంవత్సరాల కాలంలో జరిగిందని చెప్పుకో వడానికి గర్వంగా ఉందన్నారు. గూడూరు మున్సిపాలిటీ లో ఎంతోమంది చైర్మన్ లు, ఛైర్ పర్సన్ లు అయినప్పటికీ, ఆ ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడం తో, అభివృద్ధి కుంటు పడిందన్నారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత, గూడూరు పట్టణానికి కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు కోసం కేటాయించడమే కాకుండా, 30సచివాలయాలకు గడప గడప కార్యక్రమం లో ప్రజల సమస్య ల పరిష్కారం కోసం దాదాపు 6కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కేటాయించారన్నారు. చేపల మార్కెట్, మాంసం మార్కెట్, కూరగాయలు మార్కెట్ నిర్మాణం చేపట్టి, అవి పూర్తయ్యే వరకు అహర్నిశలు పర్యవేక్షణ చేస్తున్నానన్నారు. అంతేకాకుండా గూడూరు హాస్పిటల్ రోడ్డు ను, పట్టణం లో సిమెంట్ రోడ్లు, దాదాపు 10చోట్ల పైగా, ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించామన్నారు. మార్కెట్ రోడ్డు నుండి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. గూడూరు నియోజకవర్గం ప్రజల సౌకర్యం కోసం చిల్లకూరు జాతీయ రహదారి నుండి గూడూరు జగనన్న కాలనీ వరకు రింగ్ రోడ్డు నిర్మాణం కూడా త్వరలోనే ప్రారంభిస్తామని, ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్క్ కూడా ఏర్పాటు చేస్తున్నందుకు చాలా సంతోషం గా ఉందన్నారు. టీడీపీ వాళ్ల లాగా, విమర్శలు చేయకుండా అభివృద్ధి చేసి చూపుతున్నామన్నారు. ప్రభుత్వపథకాలు పొందే లబ్ధిదారులు, అవ్వా, తాతలు, అక్క చెల్లమ్మ లు, అందరూ ఒక్కసారి ఆలోచించి జగన్ మోహన్ రెడ్డి నే మళ్లీ ముఖ్యమంత్రి గా అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమం లో గూడూరు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైసీపి పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, అన్నం మురళీ, జెసిఎస్ కన్వీనర్ రాఘవ రెడ్డి, జిల్లా అట్రాసిటీ మెంబర్ రమణయ్య, పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ అధ్యక్షులుగా సనత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ నూతన అధ్యక్షులుగా సనత్ కుమార్ రెడ్డిని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. 2023– 24 సంవత్సరానికి ఇదివరకే నరసప్ప అధ్యక్షునిగా ఎన్నికైనప్పటికీ ఆయన అత్యవసరంగా విదేశాలకు వెళ్లడంతో ఆ స్థానంలో మరొక అధ్యక్షుని ఎన్నుకోవడం అనివార్యం కావడంతో కమిటీ సభ్యులు సనత్ కుమార్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎప్పటిలాగే ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్విరామముగా కొనసాగించాలని ఆశాభవం వ్యక్తం చేస్తూ ,ఎన్నికైన నూతన అధ్యక్షులు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రొటేరియన్, మాజీ అధ్యక్షులు ధనంజయ రెడ్డి మాట్లాడుతూ రోటరీ జిల్లా లోనే గూడూరు వెస్ట్ క్లబ్ ప్రథమ స్థానంలో ఉన్నదని అదే ఒరవడి ఇకపై కొనసాగేలా కార్యక్రమాలు రూపకల్పన చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడు సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దాతలు , సభ్యుల సహకారంతో మంచి కార్యక్రమంలో రూపొందించుకొని నిరంతరం సామాజిక ప్రజాసేవకు ముందు ఉంటానని తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సనత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్నామని మంచి కార్యక్రమాలతో రోటరీ వెస్ట్ క్లబ్ ముందుకు వెళ్లాలని ,తన వంతు సహాయ సహకారాలు క్లబ్ కు ఎప్పుడూ వుంటాయన్నారు.

తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు

- తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ :దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమవుతుందని తుడ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రతి ఏటా కొత్త దుస్తులు, స్వీట్లు పంపిణీ చేసి శాలువలతో ఘనంగా సత్కరించడం ఆనవాయితీ.. ఇందులో భాగంగా ఈ ఏడాది ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గురువులందరినీ సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వ ర విశ్వవిద్యాలయంలోని శ్రీనివాస ఆడిటోరియం వేదికగా శనివారం చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థలు, అంగన్ వాడీ కేంద్రాలలో పనిచేసే 1800 మంది గురువులకు ఘనంగా సన్మానించారు. సుమారు మూడు గంటల పాటు నిలుచున్న తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఒక్కొక్క ఉపాధ్యాయున్ని ఆత్మీయంగా పలుకరిస్తూ శాలువతో సత్కరించి కొత్త దుస్తులు, స్వీట్లు చేతికిచ్చి వారి నుంచి ఆశీస్సులు స్వీకరించారు. గురువులను సత్కరించే బృహత్తరమైన కార్యక్రమానికి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, తుడా కార్యదర్శి లక్ష్మీ, డీఈవో శేఖర్ లు విచ్చేశారు. ముందు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించిన తర్వాత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఎంత మేధావి అయినా గురువుకు శిష్యుడే : కలెక్టర్

ప్రపంచంలో ఎంత పెద్ద మేధావి అయినా ఒక గురువుకు శిష్యుడే అవుతాడని భావించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని గురువులను ప్రతిభతో సంబంధం లేకుండా అందరినీ ఒకేలా ఆత్మీయ సత్కారం అందించడం అభినందనీయమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువులను గౌరవించ డమంటే మంచి సమాజాన్ని నిర్మించుకోవడమే అవుతుం దన్నారు. గురువును మించిన వారు ఎవ్వరూ ఉండరని, ప్రేమతో పాఠాలు చెబితే సమాజానికి ఉపయోగపడే పిల్లలను తయారవుతారన్నారు. ఉపాధ్యాయులు కలకాలం గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎంతో మంది గురువులు అందరినీ ఏకం చేసి ఒకే వేదికపైకి తెచ్చి ఘనంగా సత్కరించడం ఒక్క ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి మాత్రమే సాధ్యమవుతుందన్నారు. ఎక్కడ గురువులు పూజింపబడతారో అక్కడ అభివృద్ధి పరుగులు పెడు తుందన్న పెద్దల మాటను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు నిరూ పించారన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేపట్టిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలు నుంచి వచ్చిన చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గురువుల గొప్పతనాన్ని చాటిచెప్పేలా పాడిన పాటలు, దైవ భక్తిని పెంపొందించే నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి.

సిసి రోడ్డునిర్మాణానికిభూమి పూజ చేస్తున్న వైసిపి నాయకులు

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి- నాయుడుపేట: నాయుడుపేట మండలం జువ్వలపాలెం పంచాయతీలోని మందబయిలు గ్రామంలోని వీధులకు 20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఆ పంచాయతీ సర్పంచ్ వెంకట రమణయ్య ఆధ్వర్యంలో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం ఈ పూజ నిర్వహించారు. ఆ గ్రామంలో 250 మీటర్ల పొడవునా నిర్మిస్తున్న ఈ సీసీ రోడ్లకి 20 లక్షల రూపాయలు వెచ్చించి నిర్మాణం చేపడుతున్నట్టు గ్రామ సర్పంచ్ తెలిపారు. ఈ పూజా కార్యక్రమానికి వారితో పాటు వైసిపి నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్ ను ప్రారంభించడం అభినందనీయమని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సంగం థియేటర్ కూడలిలో నూతనంగా ఏర్పాటుచేసిన షోరూమ్ ను ఆయనతో పాటు వైసీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి కలిసి ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 24 షోరూమ్‌ల్లో గూడూరు షోరూమ్ ఒకటి కావడం సంతోషకరమని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు. ఈ ప్రారంభోత్సవంలో బజాజ్ కంపెనీ ఉపాధ్యక్షులు గిరిధర్ రావు,రీజనల్ మేనేజరు అశోక్ కుమార్, గూడూరు మేనేజరు తేజ పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీవ్రత వేడుకలు

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట మండలంలోని కరకంబాడి సమీపంలోని రాస్ సేవా నిలయం లో వరలక్ష్మీ వ్రత వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ సేవాసమితి, రాస్ సేవా నిలయం ఆవరణలో రాస్ సిబ్బంది సలహా కమిటీ లీడర్ల సమక్షంలో అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవంగా వరలక్ష్మీ వ్రత వేడుకలను నిర్వహించారు. రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు ప్రసాదాలు ,పసుపు –కుంకుమ, చీరలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకట రత్నం , కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఉమాపతి, పొదుపు సంఘాల సంచాలకులు వి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్యపనులు

ప్రజాశక్తి -ఏర్పేడు : బండారుపల్లి గ్రామ పంచాయతీలో వర్షాల వల్ల రోడ్లపై నిలిచిపోయిన మురుగు నీరు కారణంగా నిత్యం స్కూల్ పిల్లలు, ప్రజలు ఇబ్బందులు పడడంతో గున్నేరు కిషోర్ రెడ్డి దృష్టికి గ్రామ ప్రజలు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ గ్రామ వైసిపి నాయకులతో కలిసి మురుగు నీటిను తొలగించి అంకమ్మ కమిటీ వారితో పారిశుధ్య పనులు చేశారు. అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు, మండల అధికార ప్రతినిధి ముని కృష్ణారెడ్డి, అంకమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వైసిపి నాయకులు రామ్ రెడ్డి, వీఆర్వో మనీ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గురవారెడ్డి, వెంకట్ రెడ్డి, అంకిరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, నాధముని రెడ్డి, మురళి, ధర్మారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వాలంటీరు ముని, ప్రసాద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఐజేకే ఆవిర్భావ సభ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: భారత ప్రజాతంత్ర పార్టీ (ఐ జే కే) ఆవిర్భావ సభను శనివారం తిరుపతిలో నిర్వహించారు. స్థానిక తిరుచానూరు రోడ్ లోని ఎల్‌వి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ పచ్చ ముత్తు, జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ అనంత మురుగన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రస్తుతం అనేక రాజకీయ పార్టీలు ఉన్నాయని, వీటిలో అధిక భాగం డబ్బు సంపాదన కోసం ఏర్పడ్డాయని తెలిపారు. తమ పార్టీ ప్రజా సేవ కోసం నెలకొల్పామని, వ్యాపార ఇతరత్రా ద్వారా తాము సంపాదించిన సొమ్ములో కొంత భాగాన్ని ప్రజాసేవకు ఖర్చు చేసేందుకు పార్టీని నెలకొల్పామన్నారు కుల మత ప్రాంత భేదాలు లేకుండా, ధనిక పేద అభిప్రాయాలు లేకుండా సమ సమాజ స్థాపన కోసం తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. తమ పార్టీ తమిళనాడు ఆంధ్ర లోనే కాకుండా దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో తమ పార్టీ ఆవిర్భావ సభను ఏర్పాటు చేసి, ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా కమిటీలను ప్రకటించడం సంతోషదాయకమన్నారు. నిజమైన ప్రజాసేవకే అంకితమైన తమకు ప్రజలు మద్దతివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ గాంధీ, ఆముద, మదన్‌మోహన్, జగన్నాథం, నరేంద్రబాబు, లీలా, ఉష, ఓం ప్రకాష్ బాల, గీత, జమున, అరుణాచలం, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

గురుపూజోత్సవంలో మాట్లాడుతున్న సాహితీవేత్తలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గురువు ప్రత్యక్ష దైవం అని ప్రముఖ సాహిత్యవేత్త చెన్న కేశవలు నాయుడు పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగుల భవనంలో పుత్తూరు అధ్యక్షులు భాస్కర్ రాజు ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సంబరాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య వేత్త , తెలుగు పండితులు పురుషోత్తం ఆచారి మాట్లాడుతూ అన్నీ వృత్తుల సృష్టి కర్త ఉపాధ్యాయుడు అన్నారు. పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల నిరంతర సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. విశ్వ సాహిత్య సమైఖ్య తిరుపతి, అధ్యక్షులు అంకమ నాయుడు, అనంతరం భవన నిర్మాణానికి సహరించిన వేదవ్యాస విద్యా సంస్థల అధినేత, ఎస్‌వియు కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు నారాయణ బాబును ఘనంగా సత్కరించారు. సీనియర్ విశ్రాంత గురువులు చంద్ర శేఖర్ రెడ్డి, వేణుగోపాల్, భక్తసీలన్, రాజగోపాల్ , నారాయణరాజు, నిర్మల, రామ చెంగారెడ్డి, సుకుమార్, లలితమ్మను, పుత్తూరు పరిసరాల్లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు 12 మందిని సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలసుబ్ర మణ్యం, మండల విద్యాధికారి , అధ్యక్షులు భాస్కర్ రాజు, గుణశేఖర్ రెడ్డి, రామలింగం, చంద్ర శేఖర్ వర్మ, రామమూర్తి, కృపవరమ్మ, కుప్పయ్య, మాలిని, మురళి, వెంకటకృష్ణ, రాజ్యలక్ష్మి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. వడమాలపేటకు చెందిన లలితా భోజన వసతి కల్పించారు.

ఘనంగా తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి 73వ జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ముఖ్య అతిథిగా హాజరై వైసిపి నాయకులతో కలిసి ఆయనకి పూలమాలలు, శాలువాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఇలాంటి వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలకు నాయుడుపేట మండలం వైసిపి కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ ఛైర్ పర్సన్ కటకం దీపిక, నాయుడుపేట వైసిపి సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి శ్రీనివాసరావు, నాయుడుపేట ఎంపీపీ కురగొండ్ల ధనలక్ష్మి, తిరుపతి జిల్లా వైసీపీ కార్యదర్శి ఓట్టూరి కిషోర్ యాదవ్, మాజీ ఏఎంసి ఒ ట్వా ం రాధా కిషోర్ యాదవ్, నాయుడుపేట వైసిపి నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కటకం జయరామయ్య, పొట్లపూడి రాజేష్, నాయుడుపేట కౌన్సిలర్లు దార రవిబాబు,పాలేటి నాగార్జున, టిఎంఆర్ కాలేజ్ కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి, టిఎంఆర్ సంస్థల అధినేత తంబిరెడ్డి మోహన్ రెడ్డి వైసిపి కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రజలు పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.